క్లుప్తంగా

ప్రజా ప్రతుల పుస్తకాల తరలింపు



ప్రతుల వద్ద వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన సంక్షేమ పథకాలపై వివరించేందుకు చేపట్టిన మా నమ్మకం నువ్వే జగన్ – జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని పులివెందులలో దిగ్విజయంగా నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి నగర్, అంకాలమ్మపేట, ఎస్‌బీఐ కాలనీ, రాజీవ్ కాలనీ, శ్రీరామ దేవాలయం, పెద్ద కొండప్ప కాలనీ, చిన్న రంగాపురం, వెలమవారిపల్లె సచివాలయాలకు సంబంధించి ప్రజల నుంచి సేకరించిన ప్రజా ప్రతుల పుస్తకాలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆదేశాల మేరకు సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి ఆధ్వర్యంలో విజయవాడలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోడి రమణ, కన్వీనర్లు ప్రదీప్‌రెడ్డి, రాజశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ట పూజలు



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

లింగాల : మండల పరిధిలోని మురారిచింతల గ్రామంలో నూతనంగా పునఃనిర్మితమైన శ్రీకోదండ రామస్వామి ఆలయ ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సోమవారం దీక్షా హోమాలను ప్రారంభించారు. పురోహితులు వెల్లాల రామప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహకవాచనం, అంకురార్పణ, ప్రధాన దేవతా కలశ స్థాపన, యంత్రాభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం బింబ ప్రతిష్ట, పంచామృతాభిషేకం, దీక్షా హోమం, యంత్రాభిషేకం, వాస్తు హోమాది కార్యక్రమాలు నిర్వహించనున్నామని వేద పండితులు తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



జరిమానా విధిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

వేంపల్లె : ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వేంపల్లె సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాలలో వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన రికార్డులు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. లేని పక్షంలో జరిమానాతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. మోటార్ వాహనాల చట్టం ప్రకారం వాహనాలకు నంబర్ ప్లేట్స్ కలిగి ఉండాలన్నారు. అలాగే తమ వాహన పెండింగ్ చలానాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న కౌన్సిలర్లు

పులివెందుల టౌన్ : స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ద్వారా ప్రజలకు చల్లని మజ్జిగను పంపిణీ చేశారు. సోమవారం కౌన్సిలర్ శైలజ ఆధ్వర్యంలో ప్రజలకు మజ్జిగను స్వయంగా అందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐటీఐ సాయి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఏపీఎం ఆంజనేయులు

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె దళితవాడ గ్రామంలో దివంగత తొండూరు వెంగల్‌రెడ్డి జ్ఞాపకార్థం వెంగల్ యువరాజ్‌రెడ్డి, రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను డీఆర్‌డీఏ ఏపీఎం ఆంజనేయులు సోమవారం ప్రారంభించారు. అంతకమునుపు దివంగత వెంగల్‌రెడ్డి చిత్ర పటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ పాపయ్య యాదవ్, గ్రామస్తులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



చెక్కభజన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గంగమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా అన్నమయ్య, కర్నూలు, అనంతపురం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కోరిన కోరికలు తీర్చే తల్లిగా అచ్చివెళ్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి చెందారు.

ఆకట్టుకున్న చెక్కభజన కార్యక్రమం

చెక్కభజన కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. గ్రామీణ ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతున్నాయి, ఎలాంటి పథకాలు వర్తిస్తున్నాయనే అంశాలను భజన బృందాలు పాటల రూపంలో వినిపించాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవాన్ని డప్పు వాయిద్యాలు మోగిస్తూ, టపాసులు కాల్చుతూ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు, సమీప గ్రామాల వారు పాల్గొన్నారు.

సత్తా చాటిన ‘సర్కారీ’ విద్యార్థులు

- పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు



ధనుంజయ్ (565)



షేక్ అంజుమ్(553)



షేక్ షీరీన్ బాను(535)



షేక్ త్వాహిద్ (525)

కమలాపురం : పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఉత్తమ మార్కులతోపాటు మెరుగైన ఉత్తీర్ణత శాతం సాధించి పలువురి మన్ననలు పొందారు. పట్టణంలో జ్యోతి బా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన టి.ధనుంజయ్ 565 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు. అదే పాఠశాలకు చెందిన గంగా వంశీ 552, టి.సంతోష్ 550 మార్కులు సాధించారు. చిన్నచెప్పలి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన బాలాజీరెడ్డి 561, అదే పాఠశాలకు చెందిన గంగా హైమావతి నవ్యశ్రీ 511 మార్కులు పొందారు. చిన్నరెడ్డిపల్లె ఉర్దూ హైస్కూల్‌కు చెందిన షేక్ అంజుమ్ 553, షేక్ షీరీన్ బాను 535, షేక్ త్వహీద్ 525 సాధించారు. పెద్దచెప్పలి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జగదీశ్వర్‌రెడ్డి 558, షేక్ అర్షద్ 543 వశం చేసుకున్నారు. నల్లింగాయపల్లె హైస్కూల్ చెందిన పి.వి.చంద్రమోహన్‌రెడ్డి 557, ఎస్.లీలా మోహన్‌రెడ్డి 555, వై.జాహ్నవి 551, ఆర్.హేమ నందిని 535 కైవసం చేసుకున్నారు. కమలాపురం బాలికల హైస్కూల్‌కు చెందిన మిస్బా 554 , పూజిత 548, తస్నీమ్ 544 సాధించారు. గురుకుల పాఠశాలకు చెందిన వైభవ లక్ష్మీ 525, పీవీ నాగపావణి 507 పొందారు. కమలాపురం బాయ్స్ హైస్కూల్‌కు చెందిన హరి ఓబులేసు 512, ఎర్రగుడిపాడు జెడ్పీ హైస్కూల్‌కు చెందిన నిఖిత 529, లక్ష్మీ మమత 509 కైవసం చేసుకున్నారు. కమలాపురం ఉర్దూ హైస్కూల్‌కు చెందిన రోష్ని 495, నార్య 489, సానియా 488 మార్కులు వశం చేసుకున్నారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులే.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు

చింతకొమ్మదిన్నె : ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చాయని కొలుములపల్లె ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల గంగిరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన సుష్మ 553, మైథిలి 542 మార్కులు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. పేద వర్గాలకు చెందిన విద్యార్థులు అధిక మార్కులు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

హాయిగా.. ఆనందంగా..

- గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభం
- అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- నీతి కథలు నేర్చుకుంటూ, ఆటల్లో పాల్గొంటూ..



కమలాపురం : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



లింగాల : క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. నీతి కథలు నేర్చుకుంటూ, ఆటలు ఆడుతూ ఆనందంగా గడిపారు. వారికి గ్రంథాలయ అధికారులు సూచనలు, సలహాలు అందజేస్తూ ప్రోత్సహించారు.

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభమైంది. పులివెందుల పట్టణ మానవత సంస్థ సభ్యులు, విశ్రాంతి ఉద్యోగుల సమక్షంలో గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు కొండారెడ్డి, నారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, గంగిరెడ్డి, నాగిరెడ్డి, సూర్యనారాయణరెడ్డి, గ్రంథాలయ అధికారి కృష్ణకిశోర్‌రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం : వేసవి కాలంలో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, కథల పుస్తకాలు చదవడం, నీతి కథలు చదవడంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

వేముల : వేములలోని శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయ అధికారి గంగాధర యాదవ్, ఉప సర్పంచ్ జర్మియ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చదవడం, కథలు పిల్లలతో చెప్పించడం, చిత్రలేఖనం, ఆటల పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ వేసవి శిక్షణా తరగతులలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది మహమ్మద్‌వలి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండూరు : తొండూరు శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన శిక్షణా తరగతులకు 37 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముందుగా పిల్లలతో ప్రార్థన చేయించారు. అనంతరం ఉపాధ్యాయుడు నాగేష్ కుమార్ కథ చెప్పడంతోపాటు పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : సింహాద్రిపురంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఆధ్వర్యంలో గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రారంభమయ్యాయి.

చక్రాయపేట : ప్రతి విద్యార్థి వేసవి సెలవుల్లో గ్రంథాలయాలకు వచ్చి పుస్తక పఠనం అలవరచు కోవాలని గ్రంథాలయాధికారి రాజశేఖర్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.

వల్లూరు : వల్లూరులోని శాఖా గ్రంథాలయంలో పిల్లలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలచే చెస్‌తోపాటు పలు ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వెంకటేశ్వరమ్మ, ఉపాధ్యాయుడు మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

లింగాల : లింగాల గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యార్థులు ఆటలు, పాటలు, స్పోకెన్ ఇంగ్లీషు, డ్రాయింగ్, పుస్తక పఠన కార్యక్రమాలలో విరివిగా పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారిణి జయమ్మ విద్యార్థులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తూ ప్రోత్సహించారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : సంక్షేమ పాలనకు చిరునామాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని , బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్రంలో ఆయన ప్రవేశ పెట్టిన పథకాలే అందుకు నిదర్శనమని ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మేకలబాలయపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అలాగే ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని, విద్యుత్‌దీపాలు కూడా వెలగడం లేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమస్యలను పరిష్కరించాలని సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటసుబ్బారెడ్డి, తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, వెలుగు ఏపీఎం జగదీశ్వరీ, ఎస్ఐ సంజీవరెడ్డితోపాటు గ్రామ నాయకులు పామిలేటి సుబ్బరాయుడు, వన్నూరు నరసింహారెడ్డి, గుర్రప్ప, చిన్న దండ్లూరు ఆర్బీపీపీ, కలమల్ల నాయకులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు చిన్నదండ్లూరులో..

మండలంలోని చిన్నదండ్లూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే డాక్టరు ఎం. సుధీర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం సురేంద్రనాథ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను స్వయంగా ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డితో చెప్పుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని సుందరయ్య కాలనీకి చెందిన వేణుగోపాల్ (27) అనే యువకుడు భార్య పుట్టింటికి వెళ్లిందని మనస్తాపానికి గురై ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని సోమవారం రాత్రి ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. భర్త మద్యానికి బానిస కావడంతో భరించలేక భార్య పుట్టింటికి వెళ్లినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు. దీంతో వేణుగోపాల్ మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు.

సమాజ శ్రేయస్సు కోసం ముందుండాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్

పులివెందుల టౌన్ : సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ ముందు వరుసలో ఉండాలని కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో ప్రపంచ రెడ్‌క్రాస్ డే– అవిర్భావ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రెడ్ రిబ్బన్ క్లబ్ ఇన్‌చార్జి టోపివల్లి హాజరై మాట్లాడుతూ రక్త సంబంధిత వ్యాధులు, జాగ్రత్తలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ అమల్‌రాజ్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సంస్థ ప్రజలలో ప్రకృతి వైపరీత్యాలు, ఆరోగ్య సమస్యలపట్ల ఎంతో శ్రద్ధ వహిస్తూ ప్రజలకు సహాయం చేయడంలో తమ బాధ్యత సక్రమంగా నిర్వహిస్తోందన్నారు. కళాశాల విద్యార్థులు కూడా మంచి ప్రవర్తన కలిగి ఉత్తమ పౌరులుగా సమాజానికి తమ వంతు సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జోజిరెడ్డి, పీఆర్సీ కో.ఆర్డినేటర్ ఉదయ్‌కిరణ్, అధ్యాపకులు నరేష్, శంకరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



రైతులకు అగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

చక్రాయపేట : అకాల వర్షాల సమయంలో ఉద్యాన రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని సురభి గ్రామం రెడ్డివారిపల్లె వద్ద మామిడి రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల సమయంలో మామిడి, చీనీ, నిమ్మ, కూరగాయల రైతులు కాపు దశలో పక్వానికి వచ్చిన వాటిని ముందుగానే కోసి సొమ్ము చేసుకోవాలని చెప్పారు. ఫలితంగా అకాల వర్షాల వల్ల కొంత వరకైనా నష్టాన్ని నివారించుకున్న వారు అవుతారని చెప్పారు. దీనికి తోడు రైతులు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ద్వారా తగిన సలహాలు, సూచనలు పాటిస్తే పంటలను కాపాడుకొనే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం ఉద్యాన పంటల్లో సస్యరక్షణ చర్యలు ఏ విధంగా చేపట్టాలి అనే విషయంపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి మైఖేల్ రాజీవ్, మండల ఉద్యాన శాఖ అధికారి రెడ్డెయ్య, ఉద్యాన సహాయకులు వినోద్, శ్రీకాంత్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని దేవరాజుపల్లె సచివాలయ పరిధిలోని చిన్నపుత్త, జీవంపేట, సముద్రంపల్లె గ్రామాలలో మంగళవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని ఎంపీడీఓ చలపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు.

మద్దతు ధర కల్పించాలి

చింతకొమ్మదిన్నె : రాష్ట్ర ప్రభుత్వం పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కొలుములపల్లె రైతు భరోసా కేంద్రం వద్ద పసుపు పంటకు మద్దతు ధర కల్పించాలని కోరుతూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో పసుపు పంటను విస్తారంగా సాగు చేశారని, పంట చేతికొచ్చి ఇళ్లకు చేరుతున్న తరుణంలో కొనుగోలు చేసేది లేదని అధికారులు చెప్పడం సరికాదన్నారు. ఈ కారణంగా రైతులు వచ్చిన కాడికి వ్యాపారులకు పంటను అమ్ముకుంటున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు గోపాలకృష్ణయ్య, శ్రీనివాసులురెడ్డి, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరణ

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు సర్పంచ్‌గా యర్రమసిగారి లక్ష్మీదేవి పదవీ బాధ్యతలను సోమవారం చేపట్టారు. సర్పంచ్‌గా పని చేస్తున్న శరత్‌కుమార్ అనారోగ్యం కారణంగా మెడికల్ లీవ్‌లో వెళ్లడంతో ఉపసర్పంచ్‌గా ఉన్న యర్రమాసిగారి లక్ష్మీదేవి సోమవారం నుంచి సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారని గ్రామ కార్యదర్శి తెలిపారు.

పేదలకు ఉచితంగా వడుగులు



మెడికల్ కిట్ అందజేస్తున్న పీఠాధిపతి సయ్యద్ గౌస్‌పీరా ఖాద్రీ

జమ్మలమడుగు : నిరుపేద ముస్లిం పిల్లలకు ఆస్థానయే గౌసియా, అహలెబైత్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా వడుగుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అనంతరం ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ మాట్లాడుతూ తమ చారిటబుల్ ట్రస్టు తరపున ప్రతి ఏడాది ఉచితంగా వడుగులు చేయడంతోపాటు నిరుపేద ముస్లిం బాలికలకు వివాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇస్లాంలో మహమ్మద్ ప్రవక్త బోధనల్లో ఇతరుల కష్టంలో తమ వంతు సాయాన్ని ఎవరైతే అందిస్తారో అటువంటి వారు ఉన్నత గతులు పొందడంతోపాటు వారి కీర్తి మరింత పెరుగుతుందన్నారు. ఖత్నా(వడుగులు) చేయించడం ఇస్లాంలో సున్నత్ అని పేర్కొన్నారు. అనంతరం వడుగులు చేయించుకున్న 85 మందికి మూడు వేల విలువల మెడికల్ కిట్స్‌తోపాటు చార్జీలకు వంద రూపాయలు అందించారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరుడు సయ్యద్‌షా నిజాముద్దీన్ అవులియా ఖాద్రీ, కుమారుడు సయ్యద్ షాతాహీర్‌పీరాఖాద్రీ, కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్, ట్రెజరర్ జహంగీర్, చాపాడు మహమ్మద్ గౌస్, రజాక్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

జీలుగలు, పిల్లిపెసర విత్తనాలు మంజూరు



విత్తన నమోదు ప్రక్రియను తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె : మండలానికి 10 క్వింటాలు జీలుగలు, 5 క్వింటాలు పిల్లి పెసర విత్తనాలు మంజూరయినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన అనిమెల రైతుల భరోసా కేంద్ర పరిధిలో పచ్చిరొట్ట ఎరువుల విత్తన నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 శాతం రాయితీతో జీలుగలు, పిల్లి పెసర విత్తనాలను అందజేయడం జరుగుతోందన్నారు. జీలుగలు కిలో 79 రూపాయలు కాగా రైతు వాటా 39.50, పిల్లి పెసర 97 కాగా రైతు వాటా 48.50 చెల్లించాలని సూచించారు. విత్తనం అవసరమున్న రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు తీసుకొని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని తెలిపారు. వరి సాగు చేయు రైతులకు ఎకరాకు జీలుగలు 10 కిలోలు, పిల్లి పెసర 8 కిలోలు అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాతా, శిశు మరణాలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ రమణమ్మ

తొండూరు : మాతా, శిశు మరణాలు లేకుండా చూడాలని మండల నోడల్ అధికారిణి రమణమ్మ పేర్కొన్నారు. సోమవారం తొండూరు పీహెచ్‌సీలో డాక్టర్ ఆరిఫుల్లా ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు అన్ని రకాల సేవలు అందించడంతోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శశికళ, గ్రామ హెల్త్ క్లినిక్ సమాజ ఆరోగ్య అధికారిణులు ప్రసన్న, శిరీష, సాయి దివ్య పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : మండలంలోని అన్ని గ్రామాల్లో గర్భిణుల నమోదు వంద శాతం పూర్తి చేయాలని మండల ఆరోగ్య నోడల్ అధికారి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, సచివాలయ హెల్త్ సెక్రటరీలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వీరపునాయునిపల్లె మండలం 86 శాతంతో బి గ్రేడులో ఉందని, ఏ గ్రేడులో ఉంచేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. మండల వైద్యాధికారి వెంకటగిరి, సూపర్‌వైజర్ పద్మావతమ్మ, పాయసంపల్లె, వీరపునాయునిపల్లె సెక్టార్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు జయలక్ష్మి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత అందరి బాధ్యత



దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న హెడ్మాస్టర్ ప్రభాకర్

పులివెందుల టౌన్ : దివ్యాంగులకు చేయూతనందించడం మనందరి బాధ్యత అని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ తల్లం ప్రభాకర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ముద్దనూరు రోడ్డులోని దివ్యాంగుల కార్యాలయంలో ప్రముఖ సేల్స్ ట్యాక్స్ ఆడిటర్ వంకధార నాగేశ్వరరావు మాతృమూర్తి దివంగత వంకధార భాగ్యమ్మ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె నిత్యశ్రీ అందించిన బియ్యం, నిత్యావసర సరుకులను 30 మంది దివ్యాంగులకు అందించారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, వికలాంగుల సమాఖ్య కార్యదర్శి టి.చంద్ర ఓబుళరెడ్డి, సభ్యులు, సునీల్, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత ప్రచారం

తొండూరు : మండలంలోని గంగాదేవిపల్లె, ఊడవగండ్ల గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.